సాక్షి
బాపట్ల
బుధవారం । 2 । ఆగస్టు । 2023



రవాణా శాఖ అధికారుల దాడులు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్): త్రైమాసిక పన్నులు చెల్లించని వాహనాలపై ఆర్టీఓ అధికారులు కొరడా ఝుళిపించారు. మంగళవారం 56 వాహనాలను సీజ్ చేశారు.



పులిచింతల నీటి నిల్వ

అచ్చంపేట: ఎగువ నుంచి వరద నీరు వచ్చి చేరుతుండటంతో పులిచింతల ప్రాజెక్టు మంగళవారం సాయంత్రానికి 33.7120 టీఎంసీలకు చేరింది.



662 మంది సర్టిఫికెట్ల పరిశీలన

విజయవాడ: ఏపీ ఈఏపీ సెట్-2023 కౌన్సెలింగ్‌లో భాగంగా స్పెషల్ కేటగిరి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. మంగళవారం 662 మంది సర్టిఫికెట్లు పరిశీలించారు.

న్యూస్‌రీల్

పల్నాడులో 54.13 శాతం పెన్షన్ పంపిణీ




నరసరావుపేట రూరల్: వైఎస్సార్ పెన్షన్ కానుక నెల మొదటిరోజైన మంగళవారం జిల్లాలో 54.13 శాతం పంపిణీ చేశారు. జిల్లాలో ఈనెల 2,66,348 మందికి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేయగా, తొలిరోజు 1,44,170 మందికి అందజేశారు. వలంటీర్లు తెల్లవారుజామునే లబ్ధిదారుల ఇళ్లకు వెళ్లి పెన్షన్ పంపిణీ చేశారు. లింగంగుంట్ల సచివాలయం-2 పరిధిలో పెన్షన్ల పంపిణీని డీఆర్‌డీఏ పీడీ బాలునాయక్ పరిశీలించారు. అక్కడే ఓ వృద్ధురాలికి పింఛన్ అందజేశారు.

నవోదయ ప్రవేశాలకు నోటిఫికేషన్


నరసరావుపేట ఈస్ట్: జవహర్ నవోదయ విద్యాలయాలలో 2024-25 విద్యా సంవత్సరానికి 6వ తరగతిలో ప్రవేశ పరీక్షకు నోటిఫికేషన్ విడుదలైనట్టు జిల్లా విద్యాశాఖాధికారి కె.శామ్యూల్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లా పరిధిలోని మండల విద్యాశాఖాధికారులు తమ పరిధిలోని అర్హత గల విద్యార్థులు ప్రవేశ పరీక్షకు హాజరయ్యేలా చైతన్యపరచాలని కోరారు. ఆసక్తి గల విద్యార్థులు నవోదయ.జీఓవీ.ఇన్ వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలన్నారు. దరఖాస్తులను ఈనెల 10వతేదీలోగా సమర్పించాలని తెలిపారు. వివరాలకు ఆయా మండల విద్యాశాఖాధికారులను సంప్రదించాలని సూచించారు.

సాగునీటి సమాచారం



తాడేపల్లిరూరల్ (దుగ్గిరాల) : కృష్ణా పశ్చిమ ప్రధాన కాలువకు సీతానగరం వద్ద మంగళవారం 2,010 క్యూసెక్కులు విడుదల చేశారు. బ్యాంక్ కెనాల్‌కు 500 క్యూసెక్కులు, తూర్పుకు 179, పశ్చిమకు 150, నిజాంపట్నంకు 225, కొమ్మమూరు కాల్వకు 1100 క్యూసెక్కులు విడుదల చేశారు.

సాగర్ నీటిమట్టం



విజయపురిసౌత్: నాగార్జున సాగర్ జలాశయ నీటిమట్టం మంగళవారం 514.90 అడుగుల వద్ద ఉంది. జలాశయం నుంచి ఎస్‌ఎల్‌బీసీకి 1,350 క్యూసెక్కులు విడుదలవుతోంది.

ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్‌లో ధీరజ్ సత్తా



భవానీపురం(విజయవాడపశ్చిమ): విజయవాడ చెరుకూరి ఓల్గా ఆర్చరీ అకాడమీలో దివంగత చెరుకూరి లెనిన్ (ఇండియన్ ఆర్చరీ కోచ్) వద్ద శిక్షణ పొందిన బొమ్మదేవర ధీరజ్ జర్మనీలోని బెర్లిన్ నగరంలో జరుగుతున్న ప్రపంచ ఆర్చరీ చాంపియన్‌షిప్ మెన్ విభాగంలో క్వాలిఫైయింగ్ రౌండ్‌లో 2వ ర్యాంక్ సాధించాడు. భారత జట్టుకు ప్రాతినిధ్యం వహిస్తూ సోమవారం జరిగిన రికర్వ్ క్వాలిఫైంగ్ రౌండ్‌లో 720 పాయింట్లకు గాను 683 పాయింట్లు సాధించి రెండో ర్యాంక్ సాధించాడు. ధీరజ్‌ను ఆయన తల్లిదండ్రులను, శిక్షకులను చెరుకూరి ఓల్గా అకాడమీ, ఏపీ ఆర్చరీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి చెరుకూరి సత్యనారాయణ అభినందిస్తూ ఓ ప్రకటన విడుదల చేశారు.

నిమ్మకాయల ధరలు



తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో మంగళవారం క్వింటా నిమ్మకాయల కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.1,600, మోడల్ ధర రూ.1,200 వరకు పలికింది.

మహారాజ 'పోషణ'

- నేటి నుంచి ఇంటికే వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు
- పకడ్బందీగా పథకం అమలు
- అంగన్‌వాడీ కేంద్రాలకు చేరుకుంటున్న కిట్లు
- సంచిలో పది రకాల సరుకులు

జిల్లాలో ఇలా..	
మండలాలు	: 25
ఐసీడీఎస్ ప్రాజెక్టులు	: 9
అంగన్‌వాడీకేంద్రాలు	: 1,888
గర్భిణులు	: 9,025
బాలింతలు	: 7,463
పిల్లలు	: 59,718
అంగన్‌వాడీ కార్యకర్తలు	: 1,837



పంపిణీకి సిద్ధం చేసిన వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్‌లు



అంగన్‌వాడీ కేంద్రంలో మహిళకు పౌష్టికాహారం అందజేస్తున్న దృశ్యం

బాపట్ల అర్బన్: గర్భిణులు, బాలింతలు వైఎస్సార్ సంపూర్ణ పోషణ కోసం ఇక అంగన్‌వాడీ కేంద్రాల్లో పడిగాపులు పడాల్సిన అవసరం లేదు. దర్జాగా ఇంటి వద్దే ఉండి సరుకులు తీసుకోవచ్చు. ప్రభుత్వం వీరి సౌలభ్యం కోసం విప్లవాత్మక నిర్ణయం తీసుకుంది. ప్రతినెలా రెండుసార్లు వీరికి వైఎస్సార్ సంపూర్ణ పోషణ సరుకులను ఇంటికే పంపాలని నిర్ణయించింది. బుధవారం నుంచి దీనిని అమల్లోకి తీసుకురానుంది.

15 కేజీల బ్యాగులో పది రకాల వస్తువులు

జిల్లాలోని 25 మండలాల పరిధిలో 1872 ప్రధాన అంగన్‌వాడీ కేంద్రాలు, 16 మినీ అంగన్‌వాడీ కేంద్రాలు ఉన్న విషయం తెలిసిందే. ఈ కేంద్రాల ద్వారానే ప్రతినెలా వైఎస్సార్ సంపూర్ణ పోషణ కిట్లు లబ్ధిదారులకు అందుతున్నాయి. తాజాగా లబ్ధిదారుల ఇళ్లకే కిట్లను పంపే ఉద్దేశంతో ప్రభుత్వం 15 కేజీల బ్యాగులో పది రకాల వస్తువులు కలిగిన కిట్లను సరఫరా చేస్తోంది.

గత ప్రభుత్వంలో అవస్థలు

గత ప్రభుత్వంలో ఇచ్చిన అరకొర సరుకుల కోసం గర్భిణులు, బాలింతలు గంటల తరబడి అంగన్‌వాడీ కేంద్రాల వద్ద పడిగాపులు పడాల్సి వచ్చేది. దీంతో వేచి ఉండలేక బాలింతలు, గర్భిణులు అవస్థలు పడేవారు. నెలలు నిండిన గర్భిణుల పరిస్థితి మరింత దయనీయంగా ఉండేది. సరుకుల నాణ్యత బాగుండేది కాదు. తూకాల్లో తేడా ఉండేది.

పంపిణీ చేసే సరుకులు ఇలా..	
రైస్	: 3 కిలోలు
కందిపప్పు	: కిలో
అటుకులు	: కిలో
రాగి పిండి	: కిలో
పామాయిల్	: 500 ఎంఎల్
పాలు	: 2.5 లీటర్లు
బెల్లం	: 250 గ్రాములు
వేరుశనగ చిక్కి	: 250 గ్రాములు
ఎండు ఖర్జూరం	: 250 గ్రాములు
కోడిగుడ్లు	: 30

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక మార్పు

వైఎస్సార్ సీపీ ప్రభుత్వం వచ్చాక గర్భిణులు, బాలింతలు ఎక్కువ సేపు వేచి ఉండకుండా చర్యలు చేపట్టారు. నాణ్యమైన సరుకులు ఇచ్చే ఏర్పాట్లు చేశారు. నెలలు నిండిన గర్భిణులకు ఇళ్లకే తీసుకెళ్లి ఇచ్చేలా చర్యలు చేపట్టారు. ఇప్పుడు తాజాగా మరో అడుగు ముందుకేసి బాలింతలు, గర్భిణులు అందరికీ ఇళ్లకే పది రకాల సరుకుల కిట్లు పంపిణీకి శ్రీకారం చుడుతున్నారు. దీనికోసం అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. యాప్‌ను అందుబాటులోకి తీసుకొచ్చి లబ్ధిదారులు సరుకులు తీసుకున్నారో లేదో తెలిసేలా ఫొటోలు అప్‌లోడ్ చేయాలని అధికారులు ఆదేశించారు. ఫలితంగా మహిళా లోకం నుంచి హర్షం వ్యక్తమవుతోంది.

పారదర్శకంగా పంపిణీ



వైఎస్సార్ సంపూర్ణ పోషణ పథకంలో భాగంగా టేక్ హోమ్ రేషన్ కార్యక్రమాన్ని పారదర్శకంగా అమలు చేసేందుకు ఏర్పాట్లు పూర్తి చేశాం. గర్భిణులు, బాలింతలకు 15 కిలోల బ్యాగుల్లో పది రకాల నాణ్యమైన సరుకులను నెలకు రెండు సార్లు పంపిణీ చేస్తాం. తూకం విషయంలో ఖచ్చితత్వం పాటిస్తాం. 30 గుడ్ల బరువు 1500 గ్రాములు ఉండేలా ఆదేశాలు ఇచ్చాం. అంగన్‌వాడీ కార్యకర్తలకు ప్రత్యేక శిక్షణ కూడా ఇచ్చాం. నిబంధనలు అతిక్రమించే వారిపై చర్యలు తీసుకుంటాం.

– ఉమాదేవి, మహిళా శిశు సంక్షేమశాఖ జిల్లా అధికారి, బాపట్ల

దిశ కవచ్‌తో సైబర్ మోసాల కట్టడి

ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్లటౌన్: దిశ సైబర్ కవచ్‌తో సైబర్ మోసాలను కట్టడి చేయగలమని ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. దిశ సైబర్ కవచ్ సేవలపై కొత్తగా ఏర్పాటుచేసిన యంత్రాన్ని మంగళవారం ఆయన ప్రారంభించారు. ఎస్పీ వకుల్‌జిందాల్ మాట్లాడుతూ మన మొబైల్స్, ఇతర ఎలక్ట్రానిక్ పరికరాలను దిశ సైబర్ కవచ్ మానిటర్‌కు అనుసంధానం చేస్తే వాటిని స్కాన్ చేసి అందులో ఉన్న వైరస్, సైబర్ మాల్‌వేర్‌లతోపాటు మనకు తెలియకుండా ఇన్‌స్టాలైన యాప్‌లనూ గుర్తించి తెలియజేస్తుందని తెలిపారు. ఈ మిషన్ దగ్గర సహాయంగా ఉండేందుకు శిక్షణ పొందిన పోలీస్ సిబ్బందిని నియమిస్తామని పేర్కొన్నారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏఆర్ డీఎస్పీ ఎండీహెచ్ ప్రేమ్‌కుమార్, ఎస్‌బీ సీఐ ఎ.శ్రీనివాస్, వెల్ఫేర్ ఆర్ఐ బి.శ్రీకాంత్‌నాయక్, అడ్మిన్ ఆర్ఐ ఎల్.మన్మథరావు, ఐటీ కోర్ ఎస్ఐ సి.జె.భరత్ పాల్గొన్నారు.



దిశ సైబర్ కవచ్ మిషన్‌ను ప్రారంభిస్తున్న జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్

తడి దుక్కిలో విత్తనాలు విరజిమ్మి..

- ఖరీఫ్ సీజన్‌లో డెల్టా రైతుల మరో ప్రయోగం
- విస్తారంగా కురిసిన వర్షాలతో ప్రత్యామ్నాయ పద్ధతులు

తెనాలి: భారీ వర్షాలతో నీరు నిలిచిన పల్లపు భూముల్లో వరి సాగు అలస్యమవుతోంది. దీంతో కొందరు రైతులు తడి దుక్కిలోనే వరి విత్తనాలు విరజిమ్ముతూ కొత్త ప్రయోగానికి తెరతీశారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌లో గుంటూరు జిల్లా రైతులు చిత్రమైన పరిస్థితి ఎదుర్కోవాల్సి వచ్చింది. రుతుపవనాల జాప్యంతో వర్షాభావం నెలకొంది. తర్వాత విస్తారంగా వర్షాలు కురిశాయి. అప్పటికే కొందరు వెద పద్ధతిలో వరి సాగుకు శ్రీకారం చుట్టారు. భారీ వర్షాలకు నీరు నిలిచిన చేలు, చౌడు నేలల్లో వెద పద్ధతికి అవకాశం లేకుండాపోయింది. చేలల్లో నిలిచిన నీరు పోయేందుకు కొంత సమయం పట్టింది. దీంతో వెదకు సమయం మించిపోయింది. ఇతర ప్రాంతాల్లో నారు కొనుగోలు చేయటం, నాట్లకు కూలీల కొరత సమస్యలు ఎటూ ఉండనే ఉంటాయి. ఇందుకు ప్రత్యామ్నాయంగా రైతులు తడి దుక్కి చేలల్లోనే వరి విత్తనాలను విరజిమ్మటం ఆరంభించారు. గతేడాది గుంటూరు జిల్లా వలివేరుకు చెందిన రైతు గుత్తికొండ రాఘవరెడ్డి తదితరులు విత్తనాలను విరజిమ్మే పద్ధతికి శ్రీకారం చుట్టారు. వెద సాగులో వచ్చినట్టే ఎకరాకు సగటున 35 బస్తాల దిగుబడి తీశారు. దమ్ము కూడా చేయలేదు. దీంతో ఈ ఏడాది మరికొందరు రైతులు ఇదే విధానానికి ముందుకొచ్చారు. వలివేరు, చుండూరు, కొల్లిపర మండలాల్లో తడి దుక్కిలోనే ఎకరాకు 15 నుంచి 20 కిలోల వరి విత్తనాలను చిమ్మారు. వెద పద్ధతిలో ట్రాక్టరు గొర్రుతో విత్తనాలు నాటితే భూమిలో కొంత లోతులో విత్తినట్టవుతుంది.



వలివేరులో వరి విత్తనాలు చిమ్ముతున్న కౌలు రైతు

'వెద' పద్ధతి పుట్టిందీ ఇక్కడే

పదేళ్ల క్రితం ఖరీఫ్ ఆరంభంలో వర్షాభావ పరిస్థితులు నెలకొనటం, కాలువలకు తగినంత నీరు సరఫరా లేని రోజుల్లో రైతులు వెద పద్ధతిని ఆరంభించిన విషయం తెలిసిందే. క్రమంగా పశ్చిమ డెల్టాలో 80 శాతం రైతులు వెద పద్ధతిని అనుసరిస్తూ వస్తున్నారు. దీనివల్ల నారుమడులు పెంచడం, 20-25 రోజుల తర్వాత నాట్లు వేయటమనే పద్ధతి పూర్తిగా నిలిచిపోయింది. కూలీల సమస్యను, ఖర్చులను తగ్గించుకోగలిగారు. తాజాగా ఇప్పుడు వెదకు కూడా వీల్లేని పంట చేలల్లో విత్తనాలను నేరుగా విరజిమ్ముతూ మరో ప్రయోగానికి నాంది పలికారు.

హత్య కేసులో నిందితుడికి యావజ్జీవం

గుంటూరు లీగల్: కుటుంబ కలహాల నేపథ్యంలో జరిగిన హత్య కేసులో నిందితుడికి యావజ్జీవ కారాగార శిక్ష, రూ.500 జరిమానా విధిస్తూ రెండో అడిషనల్ జిల్లా సెషన్స్ జడ్జి వి.ఎ.ఎల్. సత్యవతి మంగళవారం తీర్పు చెప్పారు. ప్రాసిక్యూషన్ కథనం మేరకు నిందితుడు పాలపర్తి శ్రీనివాసరావు తాడికొండ మండలంలోని మల్లవరంలో నివాసం ఉంటూ విజయవాడలోని ఎన్‌హెచ్‌డీసీ లిమిటెడ్‌లో కమర్షియల్ ఆఫీసర్‌గా పని చేస్తున్నారు. మృతుడు కుంభ కోటేష్ అలియాస్ కోటేశ్వరరావు అలియాస్ కిరసనాయిల్ కోటయ్య తాడికొండలోని లైబ్రరీ సెంటర్‌లో తన కూతురు బి.రాములమ్మ, మనుమరాలు పాలపర్తి శివ లీల రాణితో నివాసం ఉంటున్నాడు. శ్రీనివాసరావును రాణి ప్రేమించింది. ఈ విషయాన్ని కోటేష్ గ్రామ పెద్దలు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లడంతో చివరికి వివాహం జరిపించారు. వీరికి ఇద్దరు ఆడ పిల్లలు సంతానం కలిగారు. కాల క్రమంలో రాణి తన తల్లికి మేనల్లుడు అయ్యే శివ శంకర్‌తో సన్నిహితంగా ఉంటుందని అనుమానం పెంచుకున్న శ్రీనివాసరావు ఆమెను శారీరకంగా, మానసికంగా హింసించడం ప్రారంభించాడు. దీనిపై తరచూ వివాదాలు జరగడంతో కోటేష్ జోక్యం చేసుకుని గ్రామ పెద్దలు, పోలీసుల దృష్టికి తీసుకెళ్లాడు. ఈ నేపథ్యంలో భార్యాభర్తలు విడిపోయారు. కోటేష్ చెబితేనే మళ్లీ కాపురానికి వస్తానని రాణి తేల్చి చెప్పడంతో శ్రీనివాసరావు కోటేష్‌పై కక్ష పెంచుకున్నాడు. 2015 మే 30న కూరగాయలు కోసే కత్తితో మెడ, తలపై విచక్షణారహితంగా కోటేష్‌ను నరికాడు. దీంతో అతడు అక్కడికక్కడే మృతి చెందాడు. కూతురు రాములమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తాడికొండ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు అనంతరం చార్జిషీటు దాఖలు చేశారు. కోర్టులో నేరం రుజువుకావడంతో న్యాయమూర్తి పైవిధంగా తీర్పు చెప్పారు.

ఎస్పీ ప్రత్యేక అభినందనలు

ముద్దాయికి యావజ్జీవ కారాగార శిక్ష పడేలా చేసిన డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్ మధుసూదనరావు, ఏపీపీ మాతంగి శ్రీకాంత్, అప్పటి సీఐ చిట్టెం కోటేశ్వరరావు, కోర్టు కానిస్టేబుల్, కోర్టు మానిటరింగ్ సిబ్బందిని గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ప్రత్యేకంగా అభినందించారు.

కోడెల వర్గీయులు 16 మందికి నోటీసులు

- ఇన్‌చార్జి కన్నాకు సహకరించకుంటే చర్యలు తప్పవని జీవీ హెచ్చరికలు
- కోడెల శివరామ్, కన్నా వర్గాల మధ్య విభేదాలపై అధిష్టానానికి ఫిర్యాదు
- నేడు పార్టీ అసమ్మతి నేతలతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించనున్న బాబు

సత్తెనపల్లి: కోడెల వర్గీయులు 16 మందికి టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ ఆంజనేయులు నోటీసులు జారీచేశారు. ఇటీవలే పార్టీలో చేరి సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా బాధ్యతలు చేజిక్కించుకున్న కన్నా లక్ష్మీనారాయణకు సహకరించపోతే తీవ్ర చర్యలు తప్పవని ఆంజనేయులు స్పష్టంచేశారు. దీంతో టీడీపీలో అంతర్గత విభేదాలు మరోసారి బట్టబయలయ్యాయి.

లోకేష్ చేపట్టిన యువగళం పాదయాత్ర పల్నాడు జిల్లాలోకి ప్రవేశించిన సందర్భంగా విభేదాలు మళ్లీ భగ్గుమనడంతో పార్టీలో తీవ్ర చర్చ జరుగుతోంది. గత నాలుగు సంవత్సరాలుగా కోడెల శివరాం నియోజకవర్గంలో పార్టీ కార్యక్రమాలను నిర్వహిస్తున్నారు. ఆయనతో పాటు మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, తెలుగు యువత నాయకుడు మన్నెం శివనాగమల్లేశ్వరరావు (అబ్బూరు మల్లి) వేర్వేరుగా పార్టీ కార్యక్రమాలు చేపట్టారు. ఒక్కసారిగా కన్నాకు ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించడంతో మూడు కాస్త నాలుగు వర్గాలయ్యాయి. అయితే మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు ఈ ప్రాంత రాజకీయాలకు గుడ్ బై చెప్పారు. మన్నెం శివ నాగమల్లేశ్వరరావు కన్నాతో కలిసి పనిచేయనున్నట్లు చెప్పి ఆయన సొంత పనుల్లో నిమగ్నమయ్యారు. కోడెల శివరాం మాత్రం పట్టుదలతో ఉన్నారు. తన తండ్రి కోడెల శివప్రసాదరావు ఆశయ సాధనకు, తమకు ఎల్లవేళలా అండగా నిలిచిన కార్యకర్తలకు వెన్నుదన్నుగా ఉండాలని పార్టీ కార్యక్రమాలను స్వతహాగా కొనసాగిస్తున్నారు. దీన్ని జీర్ణించుకోలేని కన్నా తాను ఇన్‌చార్జి అయినా తనకు అందరూ సహకరించడం లేదని అధిష్టానానికి ఫిర్యాదు చేశారు. ఈ నేపథ్యంలో టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు జీవీ మంగళవారం కన్నాకు సహకరించని కోడెల వర్గీయులు 16 మందికి నోటీసులు జారీ చేశారు. ఇన్‌చార్జికి సహకరించకపోతే చర్యలు తప్పవని హెచ్చరికలు చేయడంతో విభేదాలు మరోసారి తార స్థాయికి చేరినట్లు అయింది.

అయితే పార్టీ అసమ్మతి నేతలతో టీడీపీ అధినేత చంద్రబాబు బుధవారం టెలికాన్ఫరెన్స్ నిర్వహించనున్నట్లు తెలిసింది. ఈ టెలికాన్ఫరెన్స్‌కు సైతం చాలా మంది దూరంగా ఉండనున్నట్లు పార్టీవర్గాల సమాచారం. ఎంతమంది హాజరవుతారనేది తెలియక మల్లగుల్లాలు పడుతున్నారు. కన్నా చేపట్టే కార్యక్రమాలకు తాము ఎట్టి పరిస్థితుల్లోనూ సహకరించేది లేదని కోడెల వర్గీయులు ఇప్పటికే అధిష్టానానికి తేల్చిచెప్పారని పార్టీవర్గాలు అంటున్నాయి.

ఆట గుండె ఆగింది

- అనారోగ్యంతో జాతీయస్థాయి హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు మృతి
- 9 సార్లు జాతీయస్థాయిలో సత్తా చాటిన హర్షవర్ధన్
- అంతర్జాతీయ పోటీలకు ఎంపికై కల తీరకుండానే తిరిగిరాని లోకాలకు..



సాధించిన కప్పుతో హర్షవర్ధన్(ఫైల్)



హర్షవర్ధన్ రెడ్డి మృతదేహం

జే.పంగులూరు: చిరుతలా దూసుకుపోతూ.. ప్రత్యర్థులను ముప్పుతిప్పలు పెట్టే ఆట అతని సొంతం. జిల్లా, రాష్ట్ర, జాతీయ స్థాయి ఏదైనా తనదైన శైలితో హ్యాండ్‌బాల్ పోటీల్లో సత్తాచాటేవాడు. జట్టును విజయతీరాలకు చేర్చాడు. అతని అప్రతిహత ప్రస్థానం చూసి విధికి కన్నుకుట్టిందో ఏమో.. అనారోగ్యం రూపంలో కబళించింది. ఆట గుండె ఆగినట్టు క్రీడాలోకం దిగ్భ్రాంతికి గురైంది. కన్నీటితో క్రీడావీరుడు హర్షవర్ధన్‌కు కడసారి వీడ్కోలు పలికింది.

పేదరికాన్ని జయించి..

కోటపాడు గ్రామానికి చెందిన ఆవుల హర్షవర్ధన్ రెడ్డి (23) హ్యాండ్‌బాల్ క్రీడాకారుడు. జాతీయ స్థాయిలో రాణిస్తూ అంతర్జాతీయ శిక్షణకు ఎంపికయ్యాడు. తన కలలు త్వరలో తీరతాయని ఆనంద పడిపోయాడు. అంతలోనే విధి అతనితో వింత ఆట ఆడింది. అనారోగ్యంతో సోమవారం రాత్రి మరణించాడు. మంగళవారం గ్రామంలో అంత్యక్రియలు జరిగాయి. హర్షవర్ధన్‌ది అతి నిరు పేద కుటుంబం. ఐదేళ్ల క్రితం అతడి తండ్రి శ్రీనివాసరెడ్డి మృతి చెందాడు. కోటపాడు గ్రామంలో ఉండటానికి ఇల్లు కూడా లేదు. తల్లి శ్రీదేవి కూలి పనులు చేసుకుంటూ కొడుకును చదివించింది. హర్షవర్ధన్ పేదరికాన్ని జయించి హ్యాండ్‌బాల్ క్రీడలో ప్రతిభ కనబరిచాడు. భారత్ తరపున ఆడాలని ఎన్నో కలలు కన్నాడు. మంచి ఉద్యోగం సాధించి తన తల్లిని మంచిగా చూసుకోవాలని తోటి క్రీడాకారులు, స్నేహితులకు చెబుతుండేవాడు. ఆ కలలు నెరవేరకుండానే తిరిగిరాని లోకాలకు వెళ్లిపోయాడు. నిత్యం చలాకీగా ఉరుకుతూ ఉండే కొడుకు విగతజీవిగా పడి ఉండడం చూసి తల్లి శ్రీదేవి గుండెలవిసేలా రోదించింది. తోటి క్రీడాకారులు, స్నేహితులు కన్నీరుమున్నీరయ్యారు.

హ్యాండ్‌బాల్‌పై అమితమైన ప్రేమ..

హర్షవర్ధన్ రెడ్డి చిన్ననాటి నుంచి క్రీడలపై ఎంతో ఆసక్తి కనబరిచేవాడు. 9వ తరగతి నుంచి తను హ్యాండ్‌బాల్ ఆడటం ప్రారంభించాడు. ఆసక్తి గమనించిన తల్లిదండ్రులు కుమారుడిని మరింత ప్రోత్సహించారు. ఇంటర్మీడియెట్ నుంచి కర్నూలులోని ఉస్మానియా కళాశాలలో చేరాడు. స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (సాయ్) సహకారంతో హ్యాండ్‌బాల్‌లో శిక్షణ పొందాడు. ఎన్నో పతకాలు సాధించాడు.

ఆంధ్రజట్టుకు కెప్టెన్‌గా..

ఇప్పటికి రెండుసార్లు ఆంధ్ర జట్టుకు కెప్టెన్‌గా ప్రాతినిధ్యం వహించాడు. హ్యాండ్‌బాల్‌లో ఉన్న 16 మంది క్రీడాకారుల్లో 4వ వాడిగా మంచి గుర్తింపు సాధించాడు. ప్రస్తుతం అంతర్జాతీయ హ్యాండ్‌బాల్ శిక్షణకు ఆంధ్రజట్టు నుంచి ఎంపికైనట్లు తోటి క్రీడాకారులు చెబుతున్నారు.

కుక్క కాటే.. ప్రాణం తీసిందా..

ప్రస్తుతం డిగ్రీ రెండో సంవత్సరం చదువుతున్న హర్షవర్ధన్ 15 రోజుల క్రితం ఐదో సెమిస్టర్ పరీక్షలు రాసి ఇంటికి వచ్చాడు. మూడు రోజుల క్రితం సాయంత్రం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. వణికిపోతూ ఉండడంతో తల్లి, స్థానికులు స్థానిక ఆర్‌ఎంపీ వద్ద చూపించి అక్కడి నుంచి మేదరమెట్ల వైద్యశాలకు తీసుకువెళ్లారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం ఒంగోలులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించగా అక్కడ పరిస్థితి విషమించి సోమవారం రాత్రి మరణించాడు. మూడు నెలల క్రితం గ్రామంలో హర్షవర్ధన్‌ను కుక్క కరిచింది. ఇంజక్షన్ చేసుకొని కళాశాలకు వెళ్లిపోయాడు. ఆ తర్వాత ఎలాంటి చికిత్స తీసుకోలేదు. దీనివల్ల ర్యాబిస్ వ్యాధితో చనిపోయి ఉంటాడని వైద్యులు చెప్పారు.

జాతీయ స్థాయిలో రాణింపు..

- 2023-24 సంవత్సరానికి రెండు నెలల క్రితం తమిళనాడులోని సేలంలో సౌత్ జోన్ జూనియర్ నేషనల్ క్రీడల్లో పాల్గొన్నాడు.
- 2022 మార్చిలో జూనియర్ నేషనల్ విజయవాడలో ఆడి మంచి ప్రతిభను కనబరిచి గోల్డ్ మెడల్ సాధించాడు.
- 2021-22లో మధ్యప్రదేశ్‌లో సీనియర్ నేషనల్ గేమ్స్‌లో ఆడాడు.
- 2023-24 రాయలసీమ యూనివర్సిటీ గేమ్‌లో మొదటి స్థానం సాధించాడు.
- 2021-22 ఢిల్లీలో జరిగిన జూనియర్ నేషనల్ హ్యాండ్ బాల్ చాంపియన్‌షిప్‌లో ఆడాడు.
- 2019 అండర్-17 స్కూల్ గేమ్స్‌లో కర్నాటకలో ఆడాడు.

జగనన్న సురక్ష జయప్రదం

పల్నాడు కలెక్టర్ శివశంకర్



నరసరావుపేట: పల్నాడు జిల్లాలో జగనన్న సురక్ష పథకం జయప్రదమైందని, దీనిలో భాగంగా ఇంటింటి సర్వే లక్ష్యం 97 శాతం సాధించామని కలెక్టర్ శివశంకర్ లోతేటి చెప్పారు. పథకానికి ప్రజల నుంచి విశేష స్పందన లభించిందని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ వీడియో కాన్ఫరెన్స్ హాలులో మంగళవారం కలెక్టర్ మీడియాతో మాట్లాడారు. జిల్లా వ్యాప్తంగా 538 సచివాలయాల ద్వారా 10,770 మంది వలంటీర్లు జూన్ 24 నుంచి జూలై 31 వరకు సర్వే నిర్వహించారని వివరించారు. ఇప్పటి వరకు ఈ పథకం ద్వారా 1,54,033 దరఖాస్తులు వచ్చాయని, అందులో 1,43,755 అర్జీలను పరిశీలించి 1,38,498 ధ్రువీకరణ పత్రాలను జారీచేశామని వెల్లడించారు. మిగిలిన 5,257 దరఖాస్తుల్లో 4,974 వినతులు ఆధార్ కార్డుల పేర్ల తప్పులు, ఫోన్ నంబర్ల తప్పులు, పుట్టిన, మరణ తేదీల ధ్రువీకరణ పత్రాలకు సంబంధించినవి ఉన్నాయని వివరించారు. నిర్దిష్ట కాలపరిమితిలోపు మిగిలిన దరఖాస్తులూ పరిష్కరిస్తామని చెప్పారు. పథకం విజయవంతంలో భాగస్వాములైన ఉద్యోగులు, వలంటీర్లకు అభినందనలు తెలిపారు. సమావేశంలో జిల్లా అభివృద్ధి అధికారిణి మహాలక్ష్మి, కలెక్టరేట్ ఏఓ అనిల్‌కుమార్ పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను పూర్తిచేయాలి

హౌసింగ్ పీడీ వరప్రసాదరావు

చినగంజాం: గృహ నిర్మాణాల లక్ష్యాలను హౌసింగ్ సిబ్బంది త్వరితగతిన పూర్తి చేయాలని హౌసింగ్ పీడీ వరప్రసాదరావు సిబ్బందిని ఆదేశించారు. మంగళవారం ఆయన మండల పరిషత్ సమావేశం భవనంలో హౌసింగ్ సిబ్బంది, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. గృహ నిర్మాణాలు పూర్తి చేసే విషయంలో సిబ్బంది నిర్లక్ష్యం చేయవద్దని, నిర్ణయించిన లక్ష్యాలను వీలైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. నిర్మాణ పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యతకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో తహసీల్దార్ పి.పార్వతి, ఎంపీడీఓ కె.స్వరూప రాణి, ఏడీ మురళి, ఏఈ రాజశేఖర్, సీసీ శ్రీనివాసరావు, ఉపాధి హామీ ఏపీఓ లక్ష్మీదేవి, ఇంజినీరింగ్ అసిస్టెంట్‌లు, హౌసింగ్ వర్క్ ఇన్‌స్పెక్టర్ జోసెఫ్ పాల్గొన్నారు.

10న నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ

గుంటూరు ఎడ్యుకేషన్: జాతీయ నులి పురుగుల నివారణ దినోత్సవం సందర్భంగా ఈనెల 10వ తేదీన జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో చదువుతున్న విద్యార్థులకు నులి పురుగుల నివారణ మాత్రలు పంపిణీ చేస్తున్నట్లు మంగళవారం జిల్లా విద్యాశాఖాధికారి పి.శైలజ ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఉప విద్యాశాఖాధికారులు, ఎంఈఓలు, ప్రధానోపాధ్యాయులు ఈ కార్యక్రమంపై విస్తృత ప్రచారం నిర్వహించాలని సూచించారు. ఈనెల 3వ తేదీ నుంచి 9వ తేదీవరకు ప్రతి రోజూ పాఠశాల అసెంబ్లీలో చర్చించాలని, పాఠశాల మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు సమావేశాలను నిర్వహించాలని తెలిపారు. ఎంఈఓలు, హెచ్‌ఎంలు తమ పరిధిలోని ఏఎన్‌ఎంలు, మెడికల్ అధికారులను సంప్రదించి, ఆల్బెండాజోల్ మాత్రలను పొంది, ఈనెల 10న విద్యార్థులకు పంపిణీ చేయాలని సూచించారు. విద్యార్థులు ఎవరైనా గైర్హాజరైన పక్షంలో మళ్లీ ఈనెల 17న పంపిణీ చేయాలని, సంబంధిత ఎంఈఓ నోడల్ అధికారిగా వ్యవహరించి మండలంలోని అన్ని యాజమాన్యాల్లోని పాఠశాలల్లో కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు కృషి చేయాలన్నారు. ఎంఈఓలు, హెచ్‌ఎంలు సంబంధిత వైద్య సిబ్బందిని సమన్వయం చేసుకోవాలని సూచించారు.

బీసీలంటే భయంతోనే గ్లామర్ రాజకీయాలు

- దమ్ము, ధైర్యం ఉంటే మీ హయాంలో బీసీలకు ఏంచేశారో చెప్పండి
- బీసీలకు వంద సీట్లు అంటూ ఎన్నాళ్లు మోసం చేస్తారు
- మూడు రాష్ట్ర ప్రభుత్వాల పథకాలను కాపీకొట్టి మేనిఫెస్టో అనడానికి సిగ్గుండాలి
- చంద్రబాబు, లోకేష్‌లు ఈ రాష్ట్రానికి పట్టిన సైతాన్‌లు
- ఎమ్మెల్సీ పోతుల సునీత


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ పోతుల సునీత

ఒంగోలు: బీసీలంటే భయం కాబట్టే మరోమారు బీసీలను మోసం చేయాలనే తలంపుతో గ్లామర్ రాజకీయాలకు తెరలేపావని నారా లోకేష్‌పై ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ మహిళా విభాగం రాష్ట్ర అధ్యక్షురాలు పోతుల సునీత మండిపడ్డారు. స్థానిక వైఎస్సార్ సీపీ జిల్లా కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఒంగోలులో ప్రకటించిన బీసీల గర్జన సదస్సుకు బీసీలు రారని అర్థమై యాంకర్లను తీసుకొచ్చి గ్లామర్ రాజకీయాలకు తెరలేపారన్నారు. బీసీలకు తన అయిదేళ్ల పాలనలో చంద్రబాబు మొండి చేయిచూపబట్టే ఈ పరిస్థితి అన్నారు. బీసీలకు వందసీట్లు ఇస్తానని చంద్రబాబు అసెంబ్లీ సాక్షిగా ప్రకటించి ఎన్ని సీట్లు ఇచ్చారో గమనించాలన్నారు. రూ.50 వేల కోట్లు బీసీలకు ఖర్చు చేయాల్సి ఉంటే కనీసం రూ.10 వేల కోట్లు కూడా ఖర్చుచేయలేదన్నారు. బీసీలు జడ్జిలుగా పనికిరారంటూ కేంద్రానికి లేఖ రాసిన ఆయనకు బీసీల సంక్షేమం, అభివృద్ధి గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. 14 ఏళ్ల ముఖ్యమంత్రిగా ఉన్న చంద్రబాబు ఒక్క బీసీని కూడా రాజ్యసభకు పంపలేదని అన్నారు. కానీ సీఎం వైఎస్ జగన్ తన పాలనలో ఐదుగురు బీసీలను రాజ్యసభకు పంపారని, 13 మేయర్ పదవులు ఉంటే 7 పదవులు, 13 జెడ్పీ చైర్మన్ పదవులు ఉంటే 9 పదవులు వారికే కేటాయించారన్నారు. 11 మందికి మంత్రులుగా, 31 మంది ఎంఎల్‌ఏలు, 21 మంది బీసీలకు ఎమ్మెల్సీలు ఇచ్చి చరిత్ర సృష్టించారన్నారు. బీసీలంటే చులకన భావంతో తోకలు కత్తిరిస్తా అంటూ మత్స్యకారులు, నాయీబ్రాహ్మణులపై మండిపడిన చంద్రబాబును మరోమారు ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. డ్వాక్రా మహిళల రూ.12 వేల కోట్ల రుణాలను రద్దుచేస్తానని ప్రకటించి మోసం చేసిన చరిత్ర చంద్రబాబుదైతే, రూ.25 వేల కోట్ల బకాయిలను నాలుగు విడతలుగా చెల్లించిన ఘనత జగనన్న ప్రభుత్వానిది అన్నారు. గత ఎన్నికల సమయంలో ప్రకటించిన మ్యానిఫెస్టోను సైతం టీడీపీ వెబ్‌సైట్ నుంచి తొలగించి నేడు మళ్లీ సొంతంగా మేనిఫెస్టో రూపొందించుకునే సత్తాలేక కర్నాటక, ఆంధ్రప్రదేశ్, తమిళనాడు ప్రభుత్వ పథకాలను కాపీ కొట్టి మేనిఫెస్టో అంటూ ప్రకటించడం మీ చిత్తశుద్ధిని స్పష్టం చేస్తోందన్నారు. పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.2.25 లక్షల కోట్లు నేరుగా ప్రజల ఖాతాల్లో జమచేస్తే అందులో రూ.లక్ష కోట్లు బీసీల ఖాతాల్లో జమచేశారన్నారు. గూగుల్‌లో లోకేష్ అని సెర్చ్‌చేస్తే మందు, చిందుల ఫొటోలు కనిపిస్తాయని, వాటిని తనకు పంపుతానంటూ లోకేష్ మాట్లాడిన తీరు అతని సంస్కారానికి నిదర్శనం అని మండిపడ్డారు. చంద్రబాబు, లోకేష్‌లు రాష్ట్రానికి పట్టిన సైతానులని విమర్శించారు. ఇప్పటికైనా లోకేష్ స్విమ్మింగ్ పూల్ రాజకీయాలు, అబద్ధపు మాటలు మానుకోవాలని, దమ్ము ధైర్యం ఉంటే టీడీపీ గత ఐదేళ్ల పాలనలో బీసీలకు ఏంచేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

ఫుడ్ సేఫ్టీపై వ్యాపారులు శిక్షణపొందాలి

చెరుకుపల్లి: వ్యాపారస్తులందరూ తప్పని సరిగా ఫుడ్ సేఫ్టీపై శిక్షణ పొందాలని ఫుడ్ సేఫ్టీ జిల్లా అధికారి దేవరాజు పేర్కొన్నారు. సెంట్రల్ ఫుడ్ అండ్ స్టాండార్డ్ అథారిటీ ఆఫ్ ఇండియా ఆదేశాల మేరకు వ్యాపారులకు చెరుకుపల్లి ఆర్యవైశ్య కల్యాణ మండపంలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. వ్యాపారులకు ఫుడ్ సేఫ్టీకి తీసుకోవల్సిన జాగ్రత్తలను వివరించారు. వినియోగదారులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని, లేని పక్షంలో అపరాధ రుసుం చెల్లించాల్సి ఉంటుందన్నారు. ఒకవేళ కల్తీ ఆహార పదార్థల వల్ల ఏ వ్యక్తికి అయినా ప్రాణహాని జరిగితే రూ.10 లక్షలు జరిమానా ఉంటుందని హెచ్చరించారు. అనంతరం ఫుడ్ సేఫ్టీపై ట్రైనర్ చాగంటి ఆంజనేయులు డిజిటల్ స్క్రీన్ ప్రజంటేషన్ ఇచ్చారు. అధికారులు ప్రణీత్ కుమార్, ప్రవీణ్ కుమార్, కిరాణా మర్చంట్ అసోసియేషన్ సభ్యులు, వ్యాపారులు పాల్గొన్నారు.


ఫుడ్ సేఫ్టీ శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న దేవరాజు

నీటి పైపు విషయంలో ఘర్షణ.. వ్యక్తికి కత్తిపోట్లు

మార్టూరు: నీటి పైపు విషయమై తలెత్తిన వివాదంలో ఓ వ్యక్తి కత్తిపోట్లకు గురయ్యాడు. ఈఘటన మార్టూరు సుగాలి తండాలో సోమవారం రాత్రి జరిగింది. సీఐ ఎస్‌కే టి.ఫిరోజ్ వివరాల మేరకు.. స్థానిక సుగాలి తండాలో బాణావత్ శ్రీనునాయక్‌కు అదే కాలనీకి చెందిన సువార్తబాయితో నీటి పైపు విరిగిన విషయమై మాటామాటా పెరిగి సోమవారం సాయంత్రం వివాదం జరిగింది. రాత్రికి విషయం తెలిసిన సువార్త బాయి కుమారుడు అశోక్ తల్లితో కలిసి శ్రీనునాయక్‌తో ఘర్షణ పడి పరదాలు కుట్టుకునే కత్తెరతో శ్రీను నాయక్ భుజం, వీపుపై పొడిచాడు. దాడిలో గాయపడిన శ్రీను నాయక్‌ను స్థానిక ప్రభుత్వాసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం అర్ధరాత్రి ఒంగోలు రిమ్స్‌కు తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు.

విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి

ఆర్జేడీ వి.ఎ.ఎస్.సుబ్బారావు


కార్యక్రమంలో మాట్లాడుతున్న ఆర్జేడీ సుబ్బారావు

బాపట్ల అర్బన్: ప్రధానోపాధ్యాయులు నాయకత్వ లక్షణాలను పెంపొందించుకోవాలని విద్యార్థులకు, ఉపాధ్యాయులకు రోల్‌మోడల్‌గా నిలిచి మంచిపౌరులను సమాజానికి అందించాలని ఆర్జేడీ వి.ఎ.ఎస్.సుబ్బారావు అన్నారు. సమగ్రశిక్ష అభియాన్ సమావేశ మందిరంలో మూడో విడత ప్రాంతీయ జిల్లాల సెకండరీ పాఠశాలల ప్రధానోపాధ్యాయుల కెపాసిటీ బిల్డింగ్ శిక్షణ కార్యక్రమం బాపట్లలోని విస్తరణ శిక్షణ కేంద్రాన్ని మంగళవారం సందర్శించారు. ఆర్జేడీ సుబ్బారావు మాట్లాడుతూ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్యను పెంచేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం డీఈఓ పీవీజే రామారావు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో పెరిగిన విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా గుణాత్మక విద్యను అందించాలన్నారు. రాష్ట్ర పరిశీలకురాలు కల్పన మాట్లాడుతూ బోధన పర్యవేక్షణ పద్ధతులు, పాఠ్యప్రణాళికలు ఐసీటీపై డీఆర్‌పీలు చక్కగా శిక్షణ పొందాలని సూచించారు. ప్రాంతీయ విద్యా సంచాలకులు వి.ఎస్.సుబ్బారావుతో పాటుగా సమగ్ర శిక్షా అకడమిక్ మానిటరింగ్ అధికారి మోజెస్ తదితరులు పాల్గొన్నారు.

విశ్రాంత ఉద్యోగుల సంఘం నూతన కమిటీ

సంఘం జిల్లా అధ్యక్షుడిగా నరసింహారావు



బాపట్ల: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విశ్రాంత ఉద్యోగుల సంఘం బాపట్ల జిల్లా నూతన కార్యవర్గాన్ని మంగళవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఎన్నికల అధికారులుగా బి.లవకుమార్, జి.జయబాబు, ఎస్.నారాయణరావులు వ్యవహరించగా కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడిగా వై.వి.నరసింహారావును ఎన్నుకున్నారు. కార్యదర్శిగా ఎస్.సిద్ధయ్య, ట్రెజరర్‌గా కె.రామకృష్ణారావులతో పాటు మరో 11మందిని ఎన్నుకున్నారు. ఈ ఎన్నికలలో బాపట్ల, చీరాల, అద్దంకి, మార్టూరు, ఇంకొల్లు యూనిట్ సభ్యులు పాల్గొన్నారు. ఎన్నికలలో ఏకగ్రీవంగా ఎన్నికైన చీరాల సీనియర్ సిటిజన్స్, బాపట్ల జిల్లా సీనియర్ సిటిజన్స్ అధ్యక్షుడు బ్రహ్మం అభినందించి సత్కరించారు. ఈ సమావేశంలో భవిష్యత్తు కార్యక్రమాలపై చర్చించారు.

జీడిమామిడి సాగుకు ప్రోత్సాహం

జిల్లా ఉద్యానశాఖ అధికారి జెన్నమ్మ

వేటపాలెం: ఉద్యాన పంటలైన మామిడి, జీడి మామిడి తోటల సాగుకు ప్రభుత్వం ప్రోత్సాహం ఇస్తుందని జిల్లా ఉద్యానశాఖ అధికారి జెన్నమ్మ అన్నారు. మంగళవారం స్థానిక మండల పరిషత్ ప్రాంగణంలో ఐసీడీఎస్ హాల్లో జీడి మామిడి, మామిడి సాగుపై ఎస్‌సీఎస్‌పీ జీడిమామిడి పరిశోధన ఆధ్వర్యంలో రైతులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె జీడిమామిడి సాగులో వచ్చే పురుగులు, చీడపీడల గురించి వాటి నివారణ గురించి వివరించారు. పంటల యాజమాన్యం, ఎరువుల వినియోగంపై సీనియర్ శాస్త్రవేత్త ఉమామహేశ్వరరావు వివరించారు. వివిధ పంట సాగులో డ్రిప్, స్ప్రింక్లర్, మినీ స్ప్రింక్లర్లను ఉపయోగించుకొని సక్రమంగా నీటి యాజమాన్యం చేసుకోవచ్చని తెలిపారు. ప్రభుత్వం రాయితీపై సూక్ష్మ సేద్యం పరికరాలు అదిస్తుందని, రైతులు అవకాశాన్ని ఉపయోగించుకోవాలని ప్రాజెక్టు డైరెక్టర్ బీవీ రమణ తెలిపారు. మండల ఉద్యానశాఖ అధికారి అలేఖ్య ప్రభుత్వం రాయితీపై అందిస్తున్న వివిధ పథకాల గురించి వివరించారు. కొత్తగా జీడి మామిడి, మామిడి రైతులు ఎవరైనా ఉంటే వారి వివరాలను వ్యవసాయశాఖ అధికారులకు అందజేయాలన్నారు. వారికి రాయితీ పథకాన్ని వర్తింపజేసే విధంగా కృషిచేస్తామన్నారు. మండల వ్యవసాయ సలహా మండలి చైర్మన్ పల్లపోలు శ్రీనివాసరావు మాట్లాడుతూ రైతులకు రాయితీపై జీడిమామిడి, మామిడి మొక్కలు అందించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఓ ఐ.కాశీ విశ్వనాథ్, వీఏఏ, వీహెచ్‌ఏ, ఏఈఓలు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న నిర్విరామ భక్తి గీతాలాపన

- 12 గంటల పాటు 'నీ గానమే నా ప్రాణం'
- కర్ణాటక నుంచి వచ్చిన గురుస్వాములు


భక్తిపాటల కార్యక్రమంలో పాల్గొన్న గాయకులు, అమ్మవారి వేషధారణలు

చినగంజాం: అఖిల భారత అయ్యప్ప దీక్ష ప్రచార సమితి ఆధ్వర్యంలో మంగళవారం మండలంలోని కొత్తపాలెం గ్రామ పంచాయతీ పరిధిలోని బాలకోటేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో 'నీ గానమే నా ప్రాణం' అనే అయ్యప్పస్వామి భక్తి పాటల కార్యక్రమం భక్తులను విశేషంగా ఆకర్షించింది. ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ఇప్పటి వరకు 27 కార్యక్రమాలు నిర్వహించి 28వ కార్యక్రమాన్ని చినగంజాంలో అయ్యప్పస్వామి భక్తి గీతాల గాయకుడు మున్నం లక్ష్మణ్‌రెడ్డి స్వామి ఆధ్వర్యంలో నిర్వహించారు. పూజా కార్యక్రమాలు అనంతరం ఉదయం 6 గంటలు నుంచి సాయంత్రం 6 గంటల వరకు అఖండ నామ సంకీర్తన అయ్యప్పస్వామి భక్తి పాటలు కార్యక్రమం నిర్విరామంగా 12 గంటల పాటు నిర్వహించారు. పలు వేషధారణలు నాట్యాలతో ప్రేక్షకులను అలరించారు. కార్యక్రమంలో ఉభయ తెలుగు రాష్ట్రాల్లో ప్రసిద్ధి చెందిన అయ్యప్పస్వామి భక్తి పాటల గాయకులు డప్పు శ్రీను, శివగురు, గౌరిశంకర్, హరినాథగురు, భాస్కర, రెపల్లె ఎన్వీ, వాసు, కుమారస్వామి, మల్లితో పాటు పలువురు గాయకులు పాల్గొన్నారు. పూజ్య గురుస్వాముల ఆత్మీయ సమ్మేళనం, అతిథులకు సత్కార కార్యక్రమం నిర్వహించారు. అఖండ భజన కార్యక్రమంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్, కర్ణాటకతో పాటు రెండు రాష్ట్రాల్లోని గురుస్వాములు, అయ్యప్ప భక్తులు, ప్రముఖ గాయకులు కార్యక్రమానికి విచ్చేసి ఆధ్యాత్మిక కార్యక్రమంలో పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై రైతులకు అవగాహన కల్పించాలి

డీపీఎం అమలకుమారి



మాట్లాడుతున్న డీపీఎం కె.అమలకుమారి

నరసరావుపేటరూరల్: ప్రకృతి వ్యవసాయం వైపు రైతులు వెళ్లే విధంగా అవగాహన కల్పించాల్సిన బాధ్యత మహిళా సంఘాలపై ఉందని ప్రకృతి వ్యవసాయం జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ కె.అమలకుమారి తెలిపారు. ప్రకృతి వ్యవసాయం జిల్లా కార్యాలయంలో మంగళవారం సమీక్షా సమావేశం నిర్వహించారు. అమలకుమారి మాట్లాడుతూ మహిళా సంఘాల ద్వారా గ్రామాల్లో సమావేశాలు ఏర్పాటుచేసి ప్రకృతి వ్యవసాయ విధానాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. ప్రతి గ్రామంలో ప్రకృతి వ్యవసాయం వనరుల కేంద్రాన్ని ఏర్పాటుచేసి రైతులకు కావాల్సిన కషాయాలను అందజేయాలని తెలిపారు. ప్రస్తుత కాల పరిస్థితుల్లో రసాయనాలు లేకుండా సహజ సిద్ధమైన ఎరువులతో నీమాస్త్రం, బ్రహ్మాస్త్రం కషాయాలను పంటలపై పిచికారీ చేయడం ద్వారా ఆరోగ్యకరమైన ఉత్పత్తులను అందించవచ్చని తెలిపారు. ఇంటి పరిసరాల్లో ఖాళీగా ఉన్న స్థలంలో సూర్యమండలం విధానంలో దుంప, తీగజాతి, ఆకుకూరలు, పండ్ల మొక్కలను నాటి సేంద్రియ పద్ధతుల్లో సాగు చేసుకోవచ్చన్నారు. దీని ద్వారా నెలకు రూ.2వేలు ఆదాయం పొందవచ్చని తెలిపారు. ఆర్‌బీకేల్లో అంతర పంటలకు, సరిహద్దు పంటలు వేసుకోవడానికి అవసరమైన విత్తనాలు రైతులకు అందుబాటులో ఉండేవిధంగా చూడాలన్నారు. కార్యక్రమంలో రీజనల్ కోఆర్డినేటర్ వెంకట్రావు, డీపీఎం ప్రేమ్ రాజ్, సిబ్బంది పాల్గొన్నారు.

సూర్య ఆకాష్ ప్రతిభ యువతకు ఆదర్శం


సూర్య ఆకాష్‌ను సత్కరిస్తున్న అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు

గుంటూరు(క్రీడలు): సూర్య ఆకాష్ యువతకు ఆదర్శంగా నిలిచాడని జిల్లా సాఫ్ట్ టెన్నిస్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు బత్తుల గంగాధర్, కడియం జయరావు కొనియాడారు. ఇటీవల బ్యాంకాక్‌లో నిర్వహించిన అంతర్జాతీయ సాఫ్ట్ టెన్నిస్ ఫెడరేషన్ ప్రపంచ చాంపియన్‌షిప్–2023 డబుల్స్ విభాగంలో రజతం పతకం సాధించిన విషయం విదితమే. మంగళవారం స్థానిక చంద్రమౌళీ నగర్‌లోని నాథ్‌వెల్‌నెస్ సెంటర్లో ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమం నిర్వహించారు. వారు మాట్లాడుతూ ఒడిశాకు చెందిన అన్షుమన్‌తో కలసి సూర్య ఆకాష్ ఫైనల్స్ వరకు వెళ్లాడన్నారు. ఒక పక్క విద్యనభ్యసిస్తూ ఉన్నత ఆశయంతో కఠోర శ్రమతో అద్భుత విజయం సాధించినట్లు వివరించారు. అక్టోబర్‌లో చైనాలో జరగనున్న కామన్‌వెల్త్ క్రీడలకు ఎంపికయ్యే అవకాశాలను మెరుగుపరుచుకున్నాడన్నారు. అనంతరం సూర్య ఆకాష్‌తోపాటు తల్లిదండ్రులు తోకల సుబ్బారావు, గాయత్రిలను బత్తుల గంగాధర్, కడియం జయరావు, కోచ్ జీవీఎస్ ప్రసాద్, అరుణ్, నూతలపాటి గోపీనాథ్‌లు ఘనంగా సత్కరించారు.

రౌడీషీటర్లపై పూర్తిస్థాయిలో నిఘా

- గంజాయిపై ఉక్కుపాదం మోపుతున్నాం
- స్వల్ప దాడి ఘటననూ గంజాయికి ముడి పెట్టడం సబబు కాదు
- గుంటూరు జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్


డీఎస్పీ జనార్దనరావు, సీఐ వెంకట్రావులకు సూచనలిస్తున్న ఎస్పీ ఆరిఫ్ హఫీజ్

తెనాలిరూరల్: తెనాలిలో రౌడీషీటర్లపై నిఘా పెంచాలని, వారి కదలికలపై ఎప్పటికప్పుడు సమాచారం రాబట్టాలని జిల్లా ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ పోలీసుల అధికారులకు సూచించారు. తెనాలి టూ టౌన్ పోలీస్‌స్టేషన్, కంట్రోల్ రూంను మంగళవారం ఆయన ఆకస్మిక తనిఖీ చేశారు. స్టేషన్ పరిధిలో జరుగుతున్న నేరాల గురించి తెలుసుకుని రికార్డులను పరిశీలించారు. అనంతరం ఐతానగర్ ప్రాంతాన్ని పరిశీలించారు. ఇటీవల రోడ్డు విస్తరణ పనుల కారణంగా సీసీ కెమెరాలు పనిచేయడం లేదని, వాటిని పునరుద్ధరించాలని, ఐతానగర్‌లో నైట్ బీట్‌ను పటిష్టం చేయాలని సూచించారు. ఈ ప్రాంతంలోని రౌడీషీటర్లందరిపై పూర్తిస్థాయిలో నిఘా ఉంచి నేరాల నియంత్రణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. జిల్లాలో గంజాయి, మాదకద్రవ్యాల వినియోగంపై ఉక్కుపాదం మోపుతున్నామని, ఇప్పటికే అనేక కేసులు నమోదు చేశామని చెప్పారు. గంజాయి విక్రయిస్తున్న వారితో పాటు వారు ఎక్కడ నుండి, ఎవరి నుంచి తీసుకువచ్చారో తెలుసుకుని వారిపైనా చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. తెనాలిలో సోమవారం జరిగిన దాడి ఘటనను గంజాయి మత్తులో జరిగిందని ప్రచారం చేయడం సరికాదన్నారు. ఇప్పటికే నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నామని, వారి వద్ద గంజాయి లభించలేదని, గంజాయి మత్తులో ఉన్నట్టు కూడా తమ విచారణలో నిర్ధారణ కాలేదని స్పష్టం చేశారు. ప్రతి విషయాన్ని గంజాయికి ముడిపెట్టి ప్రచారం చేయడం తగదన్నారు. తెనాలిలో పోలీసింగ్, నేర నియంత్రణకు తీసుకోవాల్సిన చర్యల గురించి డీఎస్పీ బి.జనార్దనరావు, టూ టౌన్ సీఐ ఎస్.వెంకట్రావులకు ఎస్పీ పలు సూచనలు చేశారు.

అంతర్జాతీయ మ్యూజిక్‌లో సు'సాధ్య'ం

తొమ్మిదేళ్లకే ప్రతిభ


పోలవరపు సాధ్య

గుంటూరు మెడికల్: ఓ చిన్నారి అసాధ్యాన్ని సు'సాధ్య'ం చేసింది. తొమ్మిదేళ్ల వయసులోనే అంతర్జాతీయ స్థాయి మ్యూజిక్ పోటీలో ప్రథమస్థానం దక్కించుకుంది. 9వ తేదీ కెనడాలోని టోరంటోలో నిర్వహించనున్న కార్యక్రమంలో చిన్నారి సాధ్య బహుమతి అందుకోనుంది.

వివరాలు.. గుంటూరు జిల్లా ప్రత్తిపాడు మండలం చినకొండ్రుపాడులోని కాటూరి మెడికల్ కళాశాల, హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పోలవరపు బైరారావు, సిరి కృష్ణ దంపతుల కుమార్తె సాధ్య. రెడ్ మ్యాపల్ మ్యూజిక్ కాంపిటేషన్ స్ప్రింగ్ సీజన్- 2023 పేరుతో కెనడాకు చెందిన పల్సర్ మ్యూజిక్ సంస్థ ఇటీవల ఆన్‌లైన్‌లో సంగీతం పోటీలు నిర్వహించింది. తొమ్మిదేళ్ల వయస్సు ఉన్న సాధ్య ఆన్‌లైన్ మ్యూజిక్ పోటీల్లో పాల్గొని ప్రథమ స్థానంలో నిలిచింది. బెంగళూరులోని ఓ పాఠశాలలో ఐదో తరగతి చదువుతోంది. నాలుగేళ్ల వయసు నుంచే సాధ్య కర్ణాటక సంగీతం, పాశ్చాత్య సంగీతంలో ఫణిరాజ్ వద్ద శిక్షణ పొందుతోంది. ఈ నెల 9న కెనడాలోని టోరంటోలో నిర్వహించనున్న సంగీత కార్యక్రమంలో బహుమతి అందుకోనుంది. ఈ మేరకు సాధ్య, తల్లిదండ్రులను అవార్డు తీసుకునేందుకు రావాల్సిందిగా కెనడా మ్యూజికల్ సంస్థ ఆహ్వానించింది. అంతర్జాతీయ స్థాయిలో సంగీతంలో ప్రతిభ కనబర్చిన సాధ్యను కాటూరి వైద్య కళాశాల చైర్మన్ సుబ్బారావు అభినందించారు.

అమృత్ భారత్‌కు తెనాలి స్టేషన్ ఎంపిక

తెనాలి పట్టణాభివృద్ధి సంస్థ పలు సూచనలు



తెనాలి రైల్వేస్టేషన్

తెనాలి: అమృత్ భారత్ స్టేషన్ పథకానికి తెనాలి ఎంపికై ంది. దేశవ్యాప్తంగా ప్రజాదరణ కలిగిన రైల్వేస్టేషన్లను కేంద్ర ప్రభుత్వం అభివృద్ధి చేయనున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా దక్షిణ మధ్య రైల్వే పరిధిలోని విజయవాడ డివిజనులోని 11 రైల్వేస్టేషన్లను తొలి దశలో ఎంపిక చేశారు. ప్రయాణికులకు అవసరమైన స్టేషన్ సర్క్యులేషన్ ఏరియా విస్తరణ, ఫుట్‌ఓవర్ బ్రిడ్జిలు, ప్లాట్‌ఫాంలపై రూఫ్‌ల పొడిగింపు, ఫర్నిచరు, ఎస్కలేటర్లు, లిఫ్టులు వంటి వివిధ రకాల మౌలికసదుపాయాలను కల్పించనున్నారు. అభివృద్ధిలో ప్రజల భాగస్వామ్యం కీలకమన్న భావనతో రైల్వేశాఖ ప్రజల నుంచి విజ్ఞప్తులను స్వీకరించి, వాటిని ప్రాధాన్య ప్రకారం అమలు చేయనున్నారు. విజయవాడ డివిజన్ డీఆర్‌ఎం నరేంద్ర ఆనందరావ్ పాటిల్ ఈమేరకు ప్రకటించారు. ఈనెల 3వ తేదీలోగా ఆయా రైల్వేస్టేషను పరిధిలోని ప్రజలు/ ప్రయాణికులు తమ సూచనలను te.bzi@fmail.comకు ఈ మెయిల్ చేయాల్సిందిగా కోరారు. ఈ వినతికి తెనాలి పట్టణాభివృద్ధి సంస్థ స్పందించింది. తెనాలి రైల్వేస్టేషను అభివృద్ధికి మంగళవారం పలు సూచనలు చేసింది.

పడమర వైపు ఉన్న రైల్వే బుకింగ్ కౌంటరును జనరల్ టికెట్లు, రిజర్వేషను టికెట్లకు పునరుద్ధరణ, ప్రయాణికుల కోసం రహదారి నిర్మించాలని విజ్ఞప్తి చేసింది. వికలాంగులు, సీనియర్ సిటిజన్ల కోసం మరిన్ని వీల్‌చైర్లు, 4-5 ప్లాట్‌ఫాం వద్ద ఎస్కలేటరు, పడమర బుకింగ్ కౌంటరు, దక్షిణం వైపు కొత్తగా నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జికి అన్ని ప్లాట్‌ఫాంల వద్ద లిఫ్టు సౌకర్యాన్ని కల్పించాలని కోరారు. 2-5 ప్లాట్‌ఫాంలకు ఇరువైపుల రక్షిత తాగునీరు, వాష్‌రూం సౌకర్యాలు, భోజనం, టిఫిన్ కోసం క్యాంటీన్, ఏసీ, నాన్ ఏసీ వెయిటింగ్ రూమ్‌లు, ప్రస్తుతమున్న ప్రవేశద్వారం వద్ద రద్దీని తగ్గించేందుకు దక్షిణం వైపు కొత్తగా నిర్మించిన ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద అదనంగా ప్రవేశద్వారం నిర్మించాలని సంఘ అధ్యక్షుడు దరిశి శివకోటేశ్వరరావు విన్నవించారు. ఈ ప్రకారం డీఆర్‌ఎంకు ఈమెయిల్ సందేశాన్ని పంపినట్టు విలేకరులతో చెప్పారు. వీరితో ప్రధాన కార్యదర్శి బొమ్మదేవర వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షుడు మాచిరాజు రామకృష్ణమూర్తి, ఆర్ఎస్ శంకరరావు, ఎ.కమలకుమార్, డీవీ సోమయ్య శాస్త్రి, అబ్రహాంలింకన్ ఉన్నారు.